క్లుప్తంగా

శంకరునికి ప్రత్యేక పూజలు



పిడుగురాళ్ల: పట్టణంలోని నాగులగుడి దేవస్థానంలో కార్తీక మాసం పురస్కరించుకొని గంగా పార్వతీ సమేత భవాని శంకర స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు అలంకరణలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు.

సుబ్రతారాయ్‌కి నివాళులు

గురజాల: సహారా ఇండియా అధినేత సుబ్రతారాయ్ గుండెపోటుతో మరణించడం ఎంతో బాధాకరమని గురజాల సహారా బ్రాంచి మేనేజర్ ఆంజనేయులు అన్నారు. స్థానిక సహారా కార్యాలయంలో సుబ్రతారాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేవీ ప్రసాద్, బి.మాబు, అంజిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, సుబ్బారావు, డి.శ్రీను తదితరులున్నారు.

రెంటచింతలలో ఆగంతకుడి మోసం

రెంటచింతల: మండల కేంద్రం రెంటచింతలలోని ఎస్‌బీఐ ఏటీఎం వద్ద మంగళవారం రాత్రి ఓ ఆగంతకుడు నేరానికి పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రెంటచింతలకు చెందిన ప్రవళిక రాత్రి సుమారు 8 గంటల సమయంలో ఏటీఎంలో నగదు డ్రా చేసుకునేందుకు వెళ్లగా ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆమెకు సహాయం చేసే ప్రయత్నంలో ఏటీఎం పిన్ నెంబర్‌ను గమనించాడు. సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీని ఏటీఎంలో నొక్కగా వచ్చిన రూ.35 వేల నగదును ప్రవళిక తీసుకుంది. నగదును డ్రా చేసిన అనంతరం ఆ కార్డును అతను తీసుకుని తన వద్దనున్న మరో కార్డును ప్రవళికకు ఇచ్చాడు. ఇది గమనించని ప్రవళిక ఇంటికి వెళ్లిన గంట వ్యవధిలో మాచర్ల పెట్రోలు బంకు నుంచి రూ.46 వేలు డ్రా చేసినట్లు ప్రవళిక తండ్రి సీతయ్యకు మెసేజ్ వచ్చింది. బుధవారం బాధితులు బ్యాంక్ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు ఏటీఎంలోని సీసీ పుటేజ్‌ని పరిశీలిస్తున్నారు.

18న విశ్వశాంతి అఖండ మహా బ్రహ్మ యజ్ఞం

దాచేపల్లి : మండలంలోని తంగెడ గ్రామ సమీపంలోని కృష్ణానది ఒడ్డున వేంచేసి ఉన్న ఆలేఖ్య స్వామి ఆశ్రమంలో ఈ నెల 18వ తేదీన విశ్వశాంతి అఖండ మహా బ్రహ్మ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు సాధువులు చెప్పారు. ఆశ్రమం వద్ద బుధవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాధువులు మాట్లాడుతూ..కార్తీకమాసంలో ఈ యజ్ఞం 24గంటల పాటు జరుగుతుందని, ప్రపంచ శాంతి కోసం యజ్ఞం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాధు చిదనంద దాసు, సాధు రామచంద్ర దాసు, సాధు నిరంజన్ దాసు, సాధు అన్యదాసు, సాధు ఆనాది దాసు, కమిటీ సభ్యులు మందపాటి రమేష్‌రెడ్డి, బత్తుల వెంకయ్య, నర్రా పుల్లయ్య, కొగంటి శివన్నారాయణ, సోమిశెట్టి సీతయ్య, రుద్రాల అచ్చారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పడిపూజ మహోత్సవం

పిడుగురాళ్లరూరల్: పరంజ్యోతి స్వరూపులైన అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ శాశ్వత ధర్మకర్త గుండా శ్రీనివాసరావు, అధ్యక్షులు అంచూరి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అయ్యప్ప నగర్‌లో వేంచేసియున్న అయ్యప్ప స్వామి దేవస్థానంలో గురువారం అయ్యప్పస్వామి మండల పూజ నిర్వహిస్తున్నారు. ఈ పూజ ఆలయ ప్రధానార్చకులు వీకే సతీష్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ, మహాగణపతిహోమం, మహా మంగళహారతి, 12 గంటలకు జ్యోతి ప్రజ్వలన, అనంతరం సామూహిక మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. అఖండ దీపారాధన, పడి పూజ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ సినీ హీరో సుమన్ తల్వార్, తిరుమల బ్యాంక్ చైర్మన్ చంద్రశేఖర్ హాజరవుతారని తెలిపారు. అయ్యప్ప మాల ధరించిన స్వాములకు 41 రోజులు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

న్యాయవాదులు విధులు బహిష్కరణ

గురజాల : న్యాయవాదులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బుధవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల గ్రామానికి చెందిన దళిత న్యాయవాది మందా విజయ్‌కుమార్‌పై దాడి హేయమైన చర్య అని న్యాయవాదులు అన్నారు. న్యాయవాదిపై దాడి చేసిన వారిని వెంటనే అదుపులోకి తీసుకుని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ జానీబాషా, కె.ప్రభుదాసు, చల్లా రామిరెడ్డి, కె.వి.నాగార్జున, ఎం శ్రీనివాసరెడ్డి, పి.సురేష్, జె.చెన్నకేశవులు తదితరులున్నారు.

నేటి నుంచి మాలధారులకు అన్నదానం

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో స్వామి మాలధారులకు గురువారం నుంచి స్థానిక శివాలయం ఆవరణలోని అయ్యప్ప సేవాసమితి మండపంలో నిత్య అన్నదానం చేయనున్నట్లు అయ్యప్ప సేవసమితి సభ్యులు బొద్దూరి బ్రహ్మారెడ్డి, దేవస్థానం ప్రధాన అర్చకులు వెల్లటూరి నాగేశ్వరశర్మ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా సేవసమితి సభ్యులు మాట్లాడుతూ గత 18 ఏళ్లగా నవంబర్ 16 నుంచి జనవరి 5 వరకు 51 రోజుల పాటు మాలధారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



వరికపూడిశెల ప్రాజెక్టు శంకుస్థాపనకు మాచర్ల విచ్చేసిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి, కుటుంబ సభ్యులు



శంకుస్థాపనకు వస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు



సీఎం సభకు భారీగా హాజరైన పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు,ప్రజలు



సభకు వస్తున్న ముఖ్యమంత్రికి హర్షధ్వానాలతో స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు, అభిమానులు

సీఎం సభకు తరలివెళ్లిన పార్టీ శ్రేణులు

దుర్గి: దశాబ్దాల కాలంగా నిర్లక్ష్యానికి గురైన పల్నాటి ప్రాంతానికి వరికపూడిశెల ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు శంకుస్థాపన కానున్న సందర్భాన్ని పురస్కరించుకొని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం మాచర్లలో నిర్వహించిన బహిరంగ సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి రైతులు, మహిళలు, పార్టీ శ్రేణులు, పెద్ద ఎత్తున బస్సులలో తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మూడు జిల్లాల వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పిలుపు మేరకు పార్టీ నాయకులు, నడుం బిగించి ప్రతి ఊరిలో రైతులను, మహిళలను, యువతను, సభకు సన్నద్ధం చేసి, రవాణాకు బస్సులను ఏర్పాటు చేశారు. మండలంలోని అడిగొప్పల, దుర్గి, ముటుకూరు, ధర్మవరం, కోలగుట్ల, కంచరగుంట, ఆత్మకూరు, పోలేపల్లి, ఓబులేశునిపల్లె గ్రామాల నుంచి వేల సంఖ్యలో మాచర్ల సభకు హాజరయ్యారు. డప్పు వాయిద్యాలు, పార్టీ జెండాలు చేతబూని యువకులు సందడి చేశారు. సభ విజయవంతం కావటంతో మండల వ్యాప్తంగా పార్టీ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు.

రెంటచింతల: మాచర్లలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు బుధవారం భారీగా తరలివెళ్లారు. రెంటచింతల, రెంటాల, పాలువాయి, పశర్లపాడు, మిట్టగుడిపాడు, జెట్టిపాలెం, గోలి, మంచికల్లు, పాలువాయిగేటు, మల్లవరం, తుమృకోట గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు తరలివచ్చి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వస్వాగతం పలికారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కొంటిరెడ్డి నర్శిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, దుర్గి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఆదూరి ఇన్నారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు.

వెల్దుర్తి: శ్రీరాంపురంతండా నుంచి సీఎం జగన్ సభకు బస్సులో బయలుదేరిన గిరిజనులు తరలి వెళ్లారు.





మాచర్లలో జరిగే సీఎం జగన్ సభకు బస్సుల్లో తరలి వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు



శ్రీరాంపురంతండా నుంచి సీఎం జగన్ సభకు బస్సులో బయలుదేరిన గిరిజనులు



కంభంపాడు గ్రామం నుంచి జగనన్న బహిరంగ సభకు తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కారెంపూడి నుంచి తరలివెళ్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు, అభిమానులు

సీఎం సభకు కారెంపూడి నుంచి భారీగా తరలివెళ్లిన ప్రజలు

కారెంపూడి: మాచర్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు కారెంపూడి మండలంలోని వివిధ గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, పార్టీ నాయకులు అభిమానులు బుధవారం భారీగా తరలివెళ్లారు. మండలంలోని 15 గ్రామాల నుంచి 200 బస్సుల్లో మాచర్లకు ఉత్సాహంగా తరలివెళ్లారు. మండల ప్రజా ప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు వివిధ హోదాల పార్టీ నాయకులు, నామినేటెడ్ పదవుల చైర్మన్లు, సభ్యుల ఆధ్వర్యంలో బస్సులు తరలివెళ్లాయి. ఉదయం 7 గంటల నుంచే మండలంలోని అన్ని గ్రామాల నుంచి బస్సులు మాచర్లకు బయలుదేరాయి. నాయకులు కూడా బస్సుల్లోనే సభకు వెళ్లడం విశేషం.

గ్రామ గ్రామాన తరలివచ్చిన ప్రజానీకం

మాచర్ల రూరల్: 70 సంవత్సరాల పల్నాటి ప్రాంత వాసుల చిరకాలవాంఛైన వరికపూడిశెల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు అన్ని అనుమతులు తీసుకువచ్చి శంకుస్థాపన చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మండల ప్రజలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. తెల్లవారుజాము నుంచే గ్రామాల నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో ఉదయం 8 గంటలకే సభా ప్రాంగణానికి చేరుకొన్నారు. ఈ కార్యక్రమంలోఎంపీపీ బూడిద మంగమ్మ తనయుడు శ్రీనివాసరావు జెడ్పీటీసీ మండ్లి పెద మల్లుస్వామి, మండల ఉపాధ్యక్షురాలు పోతురెడ్డి సుజాత కోటిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అప్పిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరికట్ల చంద్రారెడ్డి, చామకూర వెంకటేశ్వరరెడ్డి, ఓరుగంటి జయప్రకాశరెడ్డి, పిన్నపాటి ప్రవీణ్, వెంకట్రామయ్య, నోముల కృష్ణ, శ్రీనివాసరెడ్డి, చెంచు వెంకటేశ్వర్లు, ప్రసాద్, కందుల శివారెడ్డి, మున్నా పాపయ్య, పిన్నెల్లి రామ్మోహన్ రెడ్డి, తరిపి శ్రీను, గాజుల నాగార్జున, ఈదయ్య, అమరయ్య, రంగానాయక్, మంత్రునాయక్, మాద్యానాయక్, బొల్లారెడ్డి, భూషయ్య, రంగయ్య, గోపాల్‌రెడ్డి, గురవయ్య, మల్లయ్య, ఆదెయ్య, సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీగా తరలివెళ్లిన కార్యకర్తలు

విజయపురిసౌత్: మాచర్లలో వరికపూడిశెల ఎత్తిపోతల పథకం పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు మాచర్ల ఎంపీపీ బూడిద మంగమ్మ తనయుడు బూడిద శ్రీను ఆధ్వర్యంలో వేలాది మంది కార్యకర్తలు పలు వాహనాలలో బుధవారం తరలివెళ్లారు. సుమారు 100 బస్సులు, 20 కారులు, 90 ద్విచక్ర వాహనాలలో భారీగా తరలివెళ్లారు.



మాచర్లలో వరికపూడిశెల ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి తరలివెళ్తున్న నాయకులు

ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తోటకూర పరమేశ్వరరావు, చింతలతండా సర్పంచ్ కేతావత్ శ్రీనునాయక్, ఎంపీటీసీ సీతానాయక్, నాగులవరం సర్పంచ్ గోగిరెడ్డి వెంకట్రావమ్మ వెంకటేశ్వరరెడ్డి, పసువేముల సర్పంచ్ కిన్నెర దేవదానం, కొత్తూరు సర్పంచ్ మద్దిగపు అచ్చిరెడ్డి, ఏకోనాంపేట, నారాయణరెడ్డి పురం, విజయపురిసౌత్ గ్రామ నాయకులు కారే మునలయ్య, వి.రామదాసు, డి.సుబ్రహ్మణ్యం, బి.రమేష్, అరవపల్లి సుమన్, అన్నపరెడ్డి నారి, సైదలు, పూరి, రాంబాబు, బి.భరత్, మురళి, లక్ష్మీనారాయణ, మట్టపల్లి బ్రహ్మం, సాగర్, ఆనంద్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ అభివృద్ధికి జగన్ కావాలి

దాచేపల్లి : గత టీడీపీ ప్రభుత్వంలో అతలాకుతలమైన ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధికి జగనే కావాలని సర్పంచ్ కర్పూరపు వెంకటకోటయ్య అన్నారు. మండలంలోని పెదగార్లపాడులో ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలనే కార్యక్రమం బుధవారం చేపట్టారు. ప్రతి గడపకు వెళ్లి సీఎం జగన్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు వివరించి జగనే మళ్లీ సీఎంగా ఎందుకు ఉండాలనే అంశాలపై ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటకోటయ్య మాట్లాడుతూ...రాష్ట్ర ప్రజలంతా మళ్లీ జగనే సీఎంగా ఉండాలని కోరుకుంటున్నారని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే ఏకైక నాయకుడు జగనే అని ప్రజలు బలంగా నమ్ముతున్నారని చెప్పారు.మాజీ సర్పంచ్ కటికాల వరలక్ష్మీ, నేతలు ముత్యం చెన్నారెడ్డి, బైరపాగు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సుభిక్ష పాలన జగనన్నతోనే సాధ్యం

మాచవరం: ప్రతి ఇంటికీ సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందాలంటే మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కావాలని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి అన్నారు. మండలంలోని పిన్నెల్లి గ్రామ సచివాలయం-1 పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముందుగా సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాలు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా మంజూరైన నిధుల వివరాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాసంక్షేమ పాలన అందిస్తూ, అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూ, గ్రామాలు ఆర్థికంగా ఎదిగేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గత నాలున్నరేళ్లగా పాలన అందిస్తోందని, రాష్ట్రంలో అలాంటి సుభిక్ష పాలన కొనసాగాలంటే మరలా ఏపీకి సీఎంగా జగనే రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. గ్రామ సచివాలయం-1 పరిధిలో పరోక్ష, ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా, సచివాలయ అభివృద్ధి కార్యక్రమాలు ద్వారా సుమారు రూ. 27 కోట్లు ప్రభుత్వం అందించినట్లు వివరించారు. పలువురు మాట్లాడుతూ గత టీడీపీ పాలన అవినీతి, అక్రమాలు, పక్షపాతంగా జరిగితే, నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కుల, మత, రాజకీయ, వర్గ, పార్టీలకు అతీతంగా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు సమన్వయంతో నాలున్నరేళ్లల్లో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, వైస్ ఎంపీపీ చింతపల్లి నన్నే, చింతపల్లి జానీబేగంపెదషైదా, ఎంపీటీసీలు కొమ్ముసి పోరా మోషే ,గ్రామ ఇన్‌చార్జి పెదషైదా, ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, గ్రామ నాయకులు శివారెడ్డి, అమరావతి బుజ్జి, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వైస్సార్ సీపీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి తదితరులు



పెదగార్లపాడులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నేతలు

చింతలపూడి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చిల్డ్రన్ వాక్ పోటీలు

పిడుగురాళ్ల: చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్, పల్నాడు హాస్పటల్ ఆధ్వర్యంలో చిల్డ్రన్ వాక్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ సతీమణి లక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... చిన్నారుల్లో దాగిఉన్న శక్తిని గ్రహించి వెలికి తీయటం అభినందించదగ్గ విషయమన్నారు. పిడుగురాళ్ల పట్టణంలో ఎంతో మంది చిన్నారులు పోటీల్లో పాల్గొనటం ఆనందంగా ఉందన్నారు. పల్నాడు హాస్పటల్ డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ మాట్లాడుతూ... జూనియర్ విభాగంలో 20 మంది, సీనియర్ విభాగంలో 45 మంది చిన్నారులు వాకింగ్‌లో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు పాల్గొనటం ఆనందంగా ఉందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా పిడుగురాళ్ల జెడ్పీహెచ్ స్కూల్ హెచ్‌ఎం లింగాల ధనలక్ష్మి, కౌన్సిలర్ శ్రీరంగ రజనీ, గుండా రమాదేవిలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి చారిటబుల్ ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో ట్రస్ట్ సభ్యులు తదితరులు

ప్రకృతి వ్యవసాయం వరిలో పంటకోత ప్రయోగం

నకరికల్లు: తక్కువ పెట్టుబడితో నికర ఆదాయం సాధించేందుకు ప్రకృతి పద్ధతిలో వ్యవసాయం చేయాలని రైతు సాధికారిక సంస్థ ఎంఈఎల్ టీం రాష్ట్ర సభ్యురాలు మాధవి తెలిపారు. మండలంలోని నర్సింగపాడు గ్రామంలో వరి ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు సీహెచ్ రామసుబ్బారెడ్డి పొలంలో బుధవారం పంటకోత ప్రయోగం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదు మీటర్ల వ్యాసంలో పంటకోయగా 16.5కేజీల దిగుబడి సాధించనట్లు తెలిపారు. దీని ఆధారంగా ఎకరాకు సగటున 35 బస్తాల దిగుబడి వస్తున్నట్లు అంచనా వేశామన్నారు. ఎకరాకు రూ. 18వేల పెట్టుబడి అయినట్లు రైతు తెలిపారన్నారు. గట్లపై ఆకుకూరలు, కూరగాయలు సాగు చేయగా కుటుంబ అవసరాలు పోను రూ.5వేల ఆదాయం వచ్చిందన్నారు. ప్రతి రైతు ప్రకృతి విధానంలో సాగు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన ఉత్పత్తులు, తక్కువ ఖర్చులో అధిక లాభాలు సాధించవచ్చని సూచించారు. రైతు సాధికారిక సంస్థ ఎన్‌ఎఫ్‌ఏలు టి.సైదయ్య, ఎం.నందకుమార్, ఎం.టి.బాజిబాబు, రవికుమార్, ఐసీఆర్‌పీ షేక్ మస్తాన్‌బీ పాల్గొన్నారు.

విద్యాసామగ్రి కిట్లు అందజేత

శావల్యాపురం: బెజవాడ చారిట్రబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని నరసరావుపేట డివిజన్ డిప్యూటీ డీఈవో కె.వేణుగోపాల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో తల్లిదండ్రులను కోల్పోయిన 60 మంది బాల బాలికలకు విద్యా సామగ్రి కిట్లు అందజేత కార్యక్రమం బెజవాడ చారిట్రబుల్ ట్రస్ట్ సారథ్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈవో మాట్లాడుతూ బాలబాలికల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించటానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. అలాగే పాఠశాల పూర్వ విద్యార్థి పురిమెట్ల అజీమ్ (వ్యాయామ ఉపాధ్యాయులు) పదోవ తరగతి చదువుతున్న పేద విద్యార్థులు ఆరుగురికి పూర్వ విద్యార్థుల సహకారంతో విరాళాలు రూపంలో సేకరించిన రూ. 24 వేలు నగదును అందజేశారు. ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, ఎంఈవో మద్దికుంట సాంబశివరావు, జిల్లా మానిటరింగ్ అధి కారి పులిపాటి శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి, బెజవాడ చారిట్రబుల్ ట్రస్టు చైర్మన్ సీనియర్ ఆంగ్ల భోదకులు బెజవాడ నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు కె.రామాంజినేయులు, విశ్వసాయి జూనియర్ కళాశాల డైరెక్టరు యడవల్లి శ్రీనివాసశర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బే టీ బచావో- బేటీ పడావో కార్యక్రమం

వినుకొండ(నూజెండ్ల): ఐసీడీఎస్ వినుకొండ ప్రాజెక్టు ఎ సెక్టారు పరిధిలోని ఉర్దూ స్కూల్ వద్ద సీడీపీవో ఎం .అనురాధ ఆదేశాల మేరకు కిశోర బాలికలతో కలిసి భేటీ బచావో- భేటీ పడావో కార్యక్రమం ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శేషుకుమారి మాట్లాడుతూ విద్యార్థినీలు చదువు మధ్యలో ఆపకుండా ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలన్నారు. విద్యపై మక్కువ పెంచుకొని బాగా చదువుకొని ఉన్నతశిఖరాలు అధిరోహించాలన్నారు. బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ఉర్దూ స్కూల్ ప్రధానోపాధ్యాయులు నూరుల్లా, అంగన్‌వాడీ టీచర్లు టి. శ్రీదేవి, ఎస్. కె. రజియా, ఎస్‌కే నీలిమ, ఎస్‌కే మున్ని పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

పెదకూరపాడు: వ్యక్తి అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై వెంకట్రావు తెలిపిన వివరాలు గ్రా మానికి చెందిన శివన్నారాయణ(65) ఈనెల 9న తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామంలో బంధువుల అంత్యక్రియలకు హాజరవుతున్నట్లు చెప్పి వెళ్లి నేటి వరకు తిరిగిరాలేదు. అంత్యక్రియలకు హాజరు కాలేదని, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేదని భార్య శివకుమారి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

19న చామర్రులో బ్రాహ్మణ కార్తిక వనసమారాధన

అచ్చంపేట: పవిత్ర కృష్ణానది ఒడ్డున గల చామర్రు, విఘ్నేశ్వర ఆలయానికి సమీపంలోని వెంకటరాజావారి తోటలో బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బ్రాహ్మణ కార్తీక వనసమారాధన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఉప్పల శ్రీనివాసమూర్తి తెలిపారు. 19న ఉదయం 6.30 గంటలకు వరసిద్ధి వినాయక స్వామివారికి, అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామివారికి అభిషేకం, రుద్రహోమం, ధాత్రీపూజలు జరుగుతాయన్నారు. 8 గంటలకు అల్పాహారం, 9 గంటలకు వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామివారికి శుద్ధషష్టిని పురస్కరించుకుని శాంతికళ్యాణం, దంపతిపూజ నిర్వహిస్తామన్నారు. బాలబాలికలకు క్రీడలు, పాటలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి విందు ఏర్పాటు చేసి, 4 గంటలకు పోటీల విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు.

అటవీ సంపదను భావితరాలకు అందించాలి

దాచేపల్లి : అటవీ సంపద కాపాడాలని అటవీశాఖ జిల్లా అధికారి ఎస్. రామచంద్రరావు అన్నారు. మండలంలోని శంకరపురం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతాన్ని బుధవారం ఆయన సందర్శించారు. విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి యూనిఫాం, బ్యాగ్, లాఠీని అందజేశారు. విధుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. అటవీ సంపదను భావితరాలకు అందించాలన్నారు. అడవులు నరికివేయటం వలన భూమిపై మనిషి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని, మనిషికి అవసరమైన ఆక్సిజన్ చెట్ల నుంచే వస్తుందని తెలిపారు. అడవిలో అక్రమ తవ్వకాలు నిషిద్ధమని, అక్రమంగా అడవుల్లోకి ప్రవేశిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎఫ్‌వో వెంట రేంజ్ అధికారి విజయకుమారి, ఉప రేంజ్ అధికారి మురళి, బీట్ అధికారి మనోజ్ తదితరులున్నారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న అటవీశాఖ జిల్లా అధికారి రామచంద్రరావు